ప్రజాశక్తి
సోమవారం 21 ఏప్రిల్ 2025
5
అల్లూరి సీతారామరాజు

పిడుగుపాటుకు రెండు దుక్కిటెద్దులు మృతి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:మండలంలోని బొండం పంచాయితీ రంగినిగూడ గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో పడిన అకాల వర్షానికి పిడుగుపడి రెండు దుక్కిఎద్దులు మృతి చెందాయి. గ్రామ సమీపంలో అవులు, పశువులను మేతకు తీసుకెళ్లగా పిడుగుపడి అక్కడికక్కడే రెండు ఎద్దులు మృతి చెందాయి.గ్రామానికి చెందిన కిల్లో మొద్దు, స్వాబి సింహాచలంకు సంబంధించిన రెండు దుక్కి ఎద్దులు మృతి చెందాయి. దుక్కిఎద్దులు చనిపోవడంతో రైతు కన్నీరు మున్నీరుగా విలపించారు. తక్షణమే ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

మృతి చెందిన దుక్కిటెద్దులు

గిరిజన ప్రత్యేక డిఎస్‌సి ఆశలపై నీళ్లు

గత, ప్రస్తుత ప్రభుత్వాల తీరుతో ఆదివాసీ యువతలో నిరాశ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: గిరిజన ప్రత్యేక డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తారని సుదీర్ఘకాలంగా ఎదురు చూస్తున్న గిరిజన నిరుద్యోగుల ఆశలపై గత వైసిపి ప్రభుత్వం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం నీళ్లు చల్లాయి. ప్రభుత్వం విడుదల చేసిన మెగా డిఎస్‌సి నోటిఫికేషన్‌తో ఆదివాసీ నిరుద్యోగులకు తీరని నష్టం జరుగుతోంది. ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించి, స్థానిక గిరిజన నిరుద్యోగ యువతతో ఈ పోస్టులు భర్తీ చేస్తేనే వారికి మేలు కలుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం సాధారణంగా నిర్వహించే డిఎస్‌సి ద్వారా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇతర వర్గాల టీచర్ పోస్టులను భర్తీ చేస్తుంది. వీటిలో గిరిజనులకు ఏడు శాతం మాత్రమే రిజర్వేషన్ ఉంది. గిరిజన ప్రాంతంలో బిఎడ్, డిఎడ్ పూర్తిచేసిన అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా(గిరిజన) డిఎస్‌సి నిర్వహించి, అన్ని పోస్టులను గిరిజన అభ్యర్థులతోనే భర్తీ చేస్తుంది. 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక డిఎస్‌సి ద్వారా 640 పోస్టులను భర్తీ చేస్తామని జిఒ నంబరు 233ను జారీ చేసింది. కానీ అమలుకు నోచుకోలేదు. దీంతో గిరిజన నిరుద్యోగులు, స్పెషల్ డిఎస్‌సి సాధన సమితి, విద్యార్థి, గిరిజన సంఘాలు ఆందోళనలు చేశారు. అయినా ఫలితం లేకపోయింది. తరువాత 2015లో అప్పటి రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి రావెల కిశోర్‌బాబు గిరిజన అభ్యర్థుల కోసం ప్రత్యేక డిఎస్‌సి నిర్వహిస్తామని ప్రకటించారు. కానీ మూడేళ్లపాటు నోటిఫికేషన్ వెలువడలేదు. తరువాత 2019 ఫిబ్రవరిలో 611 పోస్టుల భర్తీకి టిడిపి ప్రభుత్వం జిఒ నంబరు 10ని జారీ చేసింది. మార్చిలో ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ వెలువడలేదు. తరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఒక్క డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వలేదు. గిరిజన ప్రత్యేక డిఎస్‌సిని పూర్తిగా పక్కన పెట్టేసింది.

గతంలో కాంగ్రెస్, టిడిపి ప్రభుత్వాలు జారీ చేసిన జిఒల ప్రకారం ప్రత్యేక డిఎస్‌సికి నోటిఫికేషన్ జారీ చేసి, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని గిరిజన నిరుద్యోగ అభ్యర్థులు పలుమార్లు ఆందోళనలు చేశారు. ఏజెన్సీ వ్యాప్తంగా గిరిజన సంక్షేమ విద్యాశాఖ పరిధిలో ఉన్న పాఠశాలల్లో, మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో కలిపి మొత్తం 10 వేలకు పైగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అంచనా. వీటిలో గిరిజన ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ ద్వారా సగం పోస్టులు భర్తీ చేసినా చాలు అన్నట్టుగా ఉంది గిరిజన అభ్యర్థుల పరిస్థితి.

జిఒ-3 కోల్పోవడంతో గిరిజనులకు తీరని నష్టం..

ఆదివాసీ ప్రాంతంపై ప్రభుత్వాలు ఉదాసీనతకు తోడు అధికారుల అలసత్వం, రాజకీయ జోక్యం వెరసి ఆదివాసీ ప్రాంతంలో విద్య, సంక్షేమ, ఉద్యోగ నియామకాలు, పదోన్నతులు కూడా లొసుగుల మయంగా మారాయి. దీనికి తోడు గడచిన 23 ఏళ్లలో ఏజెన్సీ ప్రాంతాల్లో స్థానిక ఆదివాసీలకే 100శాతం ఉద్యోగాలు కల్పించే జిఒ-3ను సుప్రీంకోర్టు 2020, ఏప్రిల్ 22న కొట్టివేయడంతో ఉద్యోగ నియామకాల్లో ఆదివాసీలకు తీరని అన్యాయం జరుగుతోంది. రాజ్యాంగపరంగా ప్రభుత్వాలు ఏజెన్సీకి ఇచ్చిన వ్యతిరేక తీర్పును పున్ణ సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఇందుకు ప్రభుత్వంతోపాటు ఆదివాసీ గిరిజన సంఘం చొరవ తీసుకుని సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేసి నాలుగేండ్లు గడుస్తున్నా.. ఏ తీర్పు రాకపోవడంతో గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారు. ముఖ్యంగా అల్లూరి జిల్లా ప్రాంత ఏజెన్సీ ఆదివాసీలకు తీరని అన్యాయం జరుగుతున్నది. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు ఉద్యోగాలు వారికి దక్కకుండా తీవ్ర నష్టం జరుగుతోంది.

ర్యాలీ చేపడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు, నిరుద్యోగులు (ఫైల్‌ఫోటో)

ప్రభుత్వాలు మారుతున్నా...

గిరిజన నిరుద్యోగుల కోసం ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ జారీ చేయాలి. చాలా ఏళ్లుగా ఎదురు చూస్తున్నాం. 2013లో కాంగ్రెస్, 2019లో టిడిపి ప్రభుత్వాలు ఇచ్చిన స్పెషల్ డిఎస్‌సి జిఒలు అమలుకు నోచుకోలేదు. గత వైసిపి ప్రభుత్వం స్పెషల్ డిఎస్ సి నోటిఫికేషన్ జారీ చేయలేదు. ఇప్పటికే మూడు ప్రభుత్వాలు మారాయి. కూటమి ప్రభుత్వమైనా స్పెషల్ డిఎస్ సి నోటిఫికేషన్ జారీ చేయాలి.

కె.వై.కుమార్,
గిరిజన నిరుద్యోగి, పాడేరు

సిఎం హామీలను అమలు చేయాలి

జిఒ-3 ప్రయోజనాలకు చట్ట బద్ధత కల్పించి గిరిజన స్పెషల్, మెగా డిఎస్ సి లకు నోటిఫికేషన్ లు విడుదల చేస్తేనే గిరిజనులకు న్యాయం జరుగుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో అరకు సభలో జిఒ-3 ప్రయోజనాలకు కట్టుబడి ఉన్నామని, అధికారంలోకి రాగానే అమలుకు చర్యలు తీసుకుంటామన్న హామీని మరిచి మెగా డిఎస్ సి నోటిఫికేషన్ విడుదల చేయడం గిరిజనులకు అన్యాయం చేయడమే.

పి.బాలదేవ్
జిల్లా ప్రధాన కార్యదర్శి,
ఆదివాసీ గిరిజన సంఘం

మెగా డిఎస్‌సిలో ఆదివాసీలకు అన్యాయం

- సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ లో ఆదివాసులకు తీవ్ర అన్యాయం జరిగిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని కూడా విస్మరించడం చాలా దారుణమని సిపిఎం అల్లూరు జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స విమర్శించారు. పాడేరు సిపిఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జీవో నెంబర్ 3 సుప్రీంకోర్టు రద్దు చేసి నేటిక ఐదు సంవత్సరాలు కావస్తున్నా పునరుద్ధరణకు ప్రభుత్వాలు ప్రయత్నం చేయలేదని, జగన్ ప్రభుత్వ అడుగుల్లో మడుగులు ఎత్తుతున్న కూటమి ప్రభుత్వం కూడా ఆదివాసులకు అన్యాయం చేసిందని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ ఆదివాసులకు తీవ్రమైన నిరాశ, నిస్పృహలకు గురి చేసిందని ముఖ్యమంత్రి స్థాయిలో మూడుసార్లు ఆదివాసి ప్రత్యేక డీఎస్సీకై ప్రత్యేకమైన చర్య తీసుకుంటున్నట్లు ప్రకటించారన్నారు. ఆదివాసీలకు నూరు శాతం ఉద్యోగ ఉపాధ్యాయ రిజర్వేషన్ పునరుద్ధరణ చేస్తామని అన్నారు. నేటి డీఎస్సీ నోటిఫికేషన్ అందుకు బిన్నంగా ఉందని అన్నారు. ప్రభుత్వం మెగా డీఎస్సీ లో అల్లూరి సీతారామరాజు జిల్లాలో 400 పోస్టులకు గాను ఎస్టీలకు కేవలం 24 మాత్రమే కేటాయించారన్నారు. ఆదివాసీ స్పెషల్ డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని అందు కోసం ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేయాలని కోరారు. లేని యెడల ఆదివాసీ గిరిజన సంఘాల లతో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ప్రాథమిక పాఠశాలలను రద్దు చేయొద్దు

• యుటిఎఫ్ అల్లూరి జిల్లా కమిటీ డిమాండ్

జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నేత కృష్ణ

ప్రజాశక్తి-రంపచోడవరం : రాష్ట్ర ప్రభుత్వం మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటును యుటిఎఫ్ అల్లూరి జిల్లా కమిటీ స్వాగతిస్తుందని, అదే సందర్భంలో ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 తరగతు లను సమీప పాఠశాలల్లో విలీనం చేస్తూ ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మార్చడాన్ని వ్యతిరేకిస్తున్నామనియుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక యుటిఎఫ్ హోంలో రంపచోడవరం డివిజన్ పరిధిలోని 11 మండలాల యుటిఎఫ్ కార్యవర్గ సభ్యుల ప్రాంతీయ కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ పాలకుల విధానాల ఫలితంగా ప్రభుత్వ బడికి ముప్పు ఏర్పడిందన్నారు. ప్రభుత్వ బడుల్లో చేరే పిల్లల సంఖ్య తగ్గుతోందని, ప్రభుత్వ విద్యారంగం భవిష్యత్తులో కనుమరుగయ్యే ప్రమాదంలో పడనుందనానరు.. ప్రభుత్వ విద్యారంగం ఉంటేనే పేద బడుగు బలహీన వర్గాలకు చదువు అందుతుందని, అందుకే దీన్ని కాపాడుకునే విధంగా ప్రతి ఉపాధ్యాయుల కృషి చేయాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రస్తుత విద్యావిధానాలపై అవగాహన కల్పించి, తమ పిల్లలందరినీ మన ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు పి కష్ణయ్య జిల్లా కార్యదర్శిలు కే ఆదిరెడ్డి కే సూర్య బాబు జి.తేజరావు ఎం రమేష్ బాబు. జిల్లా అసోసియేట్ మహేష్, 11 మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ సండే

ప్రజాశక్తి-ఎటపాక : ఏసుక్రీస్తు పునరుత్థానం చిరస్మరణీయమని, క్రైస్తవులు ఆయన బోధనలు ప్రవర్తన ద్వారా చూపాలని ఏసుక్రీస్తు సీయోను మినిస్ట్రీస్ పాస్టర్ నవీన్ లాజరస్ అన్నారు. ఎటపాక మండలంలో గ్రామగ్రామాన ఈస్టర్ వేడుకలు ఆదివారం సందడిగా జరిగాయి. మేడువాయి, ఎటపాక, నెల్లిపాక, గుండాల, లక్ష్మీపురం, గన్నవరం నందిగామ, తోటపల్లి, సీతాపురం, మురుమూరు, నల్లకుంట, కష్ణవరం, విసాపురం, పుసుగ్గూడెం, ఎర్రగట్టు, గన్నేరుకొయ్యపాడు గ్రామాల్లోని చర్చిలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గౌరిదేవిపేట చర్చిలో హెప్సీబా లాజసర్ ఈస్టర్ గురించి వివరించారు. సమాజంలో క్రైస్తవులు సత్ప్రవర్తనతో నడుచుకోవాలన్నారు. సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈస్టర్ పాటలకు యువత, చిన్నారులు డ్యాన్స్ చేసి అలరించారు. పలు చోట్ల ప్రదర్శించిన నాటికలు ఆకట్టుకున్నాయి. ఏలియా, ఒనేసిము, ఒబద్య, గిద్యోనూ, తిమోతి, అబ్రాహాం, రాము, ఎజ్రా, సత్యనారాయణ పాల్గొన్నారు.

నృత్యాలు చేస్తున్న చిన్నారులు

వికలాంగుల ఉపకరణాల కోసం నేటి నుంచి శిబిరాలు

ప్రజాశక్తి - రంపచోడవరం : వికలాంగులకు ఉచిత ఉపకరణాల గుర్తింపునకు ఎఎల్ఐఎంసిఒ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి శిబిరాలను నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు సహాయ సంస్థ సహాయ సంచాలకులు, జిల్లా మేనేజర్ జి మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. రంపచోడవరం డివిజన్ పరిధిలో .రంపచోడవరం, దేవీపట్నం, గంగవరం మండలాల వికలాంగ అభ్యర్థులకు ఈనెల 21న రంపచోడవరం మండల పరిషత్ కార్యాలయంలోనూ, మారేడుమిల్లి, వై.రామవరం ఎగువ మండలానికి ఈనెల 22న మారేడుమిల్లి మండల పరిషత్‌లోనూ, మఅడ్డతీగల, వై.రామవరం దిగువ మండలం, రాజవొమ్మంగి మండలాల వికలాంగులకు ఈనెల 23న అడ్డతీగల మండల పరిషత్ కార్యాలయంలోనూ, చింతూరు, ఎటపాక కూనవరం, వి.ఆర్.పురం మండలాలకు ఈనెల 24 న చింతూరు మండల పరిషత్ కార్యాలయాల్లో వికలాంగులకు ఉపకరణాల గుర్తింపు శిబిరాలు జరుగుతాయన్నారు. అవసరమైన వికలాంగ అభ్యర్థులు సదరం సర్టిఫికేట్, ఆధార్, తెల్లరేషన్ కార్డు లేదా ఆదాయ ధవపత్రంతో శిబిరాలకు హాజరై లబ్ధి పొందాలని మాధవి కోరారు.

సీలేరు నదిలో ఇద్దరు యువకుల గల్లంతు

సంఘటనాస్థలి సందర్శనలో ఐటిడిఏ పిఒ, ఎఎస్‌పి, ఇరువైపులా గల్లంతైన యువకులు

ప్రజాశక్తి - చింతూరు : సీలేరు నదిలో ఇద్దరు యువకులు గల్లంతైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఆదివారం కావడంతో, చింతూరుకు చెందిన మనోజ్ కుమార్, రవి, వడ్డాది సిద్ధార్థ, విఆర్ పురానికి చెందిన తెల్లం వెంకన్న బాబు, చింతూరుకు చెందిన నాగుల దిలీప్‌కుమార్, సుగ్రీయ శీను అనే ఆరుగురు యువకులు చింతూరు సమీపంలోని సీలేరు నదికి విహార యాత్రకు వెళ్లారు. అందులో చింతూరుకు చెందిన నాగుల దిలీప్ కుమార్ (25) సుగ్రీవ శీను (25) అనే వ్యక్తులు సీలేరు నదిలో గల్లంతయ్యారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు, స్థానికులు గాలింపు చర్యలు చేపట్టినా యువకులు ఆచూకీ లభ్యం కాలేదు. చింతూరు ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్, చింతూరు ఎఎస్‌పి పంకజ్ కుమార్ మీనా ఆదివారం రాత్రి సంఘటన స్థలాన్ని సందర్శించారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి

ప్రజాశక్తి- పెదబయలు: మండలంలోని జామిగుడా పంచాయతీ గుంజివాడ, చింతలవీధి గ్రామాల్లో ఎస్ ఐ రమణ సిబ్బందితో ఆదివారం పర్యటించారు. జామిగూడ సర్పంచి వెంకట్‌రావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఇటీవల కాలంలో పెరిగిన సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎస్ఐ వివరించారు. గ్రామాల్లో నాటుసారా అరికట్టడానికి గ్రామస్థులు సహకారం ఇవ్వాలని కోరారు. ఫోక్సో చట్టం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో బాల్యవివాహాలు ప్రోత్సహించవద్దని, ఇవి నేరమని వివరించారు. మూడనమ్మకాలతో దాడులు చేయవద్దని సూచించారు. వితంతువులు, వృద్ధులకు నిత్యావసర సరుకుల కిట్లను ఎస్ఐ రమణ, సర్పంచి పంపిణీ చేశారు. గ్రామంలోని యువతకు వాలీబాల్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సరుకులు ఇస్తున్న ఎస్ఐ

పాలకవర్గ సమావేశానికి సిద్ధం చేసిన వేదిక

33 నెలలు తర్వాత.. నేడు ఐటిడిఎ పాలకవర్గ సమావేశం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పాడేరు ఐటిడిఎ 74వ పాలకవర్గ సమావేశానికి అన్ని ఏర్పాట్లు ఐటిడిఎ అధికారులు పూర్తి చేశారు. ఇప్పటికే జిల్లా ఇన్చార్జి మంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మాత్యులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపిపిలు, జడ్‌పిటిసిలకు, జిల్లా అధికారులకు సమాచారం పంపించడం జరిగింది. ఐటిడిఎ సమావేశ మందిరంలో ఈ నెల 21న ఉదయం 11 గంటలకు పాలకవర్గ సమావేశం ప్రారంభం కానుంది. అన్ని శాఖల అధికారులు నిర్దేశించిన సమయానికి పాలకవర్గ సమావేశానికి హాజరు కావాలని ఐటిడిఎ ఇన్చార్జి ప్రాజెక్ట్ అధికారి, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె అభిషేక్ గౌడ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు.

నెలలకొద్దీ నిర్లక్ష్యం!

రాష్ట్రంలోనే పెద్దదైన పాడేరు ఐటిడిఎ పాలకవర్గ సమావేశం 33 నెలలు తర్వాత సోమవారం నిర్వహిస్తుండడంతో ప్రధాన సమస్యలు పరిష్కారం అవుతాయని స్థానిక గిరిజనులు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. 33 నెలలుగా పాలకవర్గ సమావేశాలు నిర్వహించకపోవడంతో చాలా సమస్యల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. పాలక వర్గ సమావేశం నిర్వహించక పోవడంతో గిరిజన గ్రామాల్లో సమస్యలు అపరిష్కృతంగానే మిగిలిపోయి గిరిజన సంక్షేమం, అభివృద్ధి కుంటుపడిందన్న విమర్శలున్నాయి. ఫలితంగా అధికారుల ఇష్టారాజ్యంగా పాలన జరుగుతోందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. గత వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో పాడేరు ఐటిడిఎ మొక్కుబడిగా మారింది. కనీసం పాలకవర్గ సమావేశాలు కూడా సక్రమంగా నిర్వహించని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో గిరిజన సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు అమలుపై పూర్తిస్థాయి సమీక్ష కొరవడింది. తద్వారా మన్యం గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి మార్గం దొరకడం లేదు. మూడు నెలలకో సమావేశం నిర్వహించాల్సి ఉండగా.. చివరిగా 2022 జూలై 2న నిర్వహించారు. వాస్తవానికి రాజ్యాంగం ఆర్టికల్ 275 ఆధారంగా ఏర్పడిన ఐటిడిఎల్లో ప్రతీ మూడు నెలలకు ఐటిడిఎ చైర్మన్ హెూదాలో జిల్లా కలెక్టర్ పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించాలి.

ఏడాదిలో ఒక్క రోజైనా తెరుచుకోలే.!

- విద్యాసంవత్సరం పొడుగునా మూతబడిన పాఠశాల
- 20 మంది గిరిజన విద్యార్థుల చదువు గాలికి..
- ఇదీ కర్ణికోట ఎంపిఇ పాఠశాల దుస్థితి

ప్రజాశక్తి -వై.రామవరం : గడచిన జూన్‌లో ప్రారంభమైన విద్యాసంవత్సరం మరో రెండు రోజుల్లో ముగిసిపోనుంది. అయితే ఏడాదిలో ఒక్కరోజైనా ఆ పాఠశాల తెరుచుకోలేదంటే ఆశ్చర్యం కలగక మానదు. కానీ ఇది నిజం... అధికారులు, నేతల నిర్లక్ష్యానికి 20మంది గిరిబాలల చదువు, భవిష్యత్ గాలిలో కలిసిపోతున్నా ఒక్కసారైనా అటువైపు కన్నెత్తి చూడలేదు. ఉపాధ్యాయుడు లేని పరిస్థితిలో కనీసం ప్రత్యామ్నాయ ఏర్పాటైనా చేయని అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనమీ పాఠశాల. మండలంలోని పాతకోట పంచాయతీ, కర్ణికోట పాఠశాల దుస్థితి ఇది.

అల్లూరి సీతారామరాజు జిల్లా వై రామవరం మండలం ఎగువ ప్రాంతంలో పాతకోట పంచాయతీ గుర్తేడు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని కర్ణికోట గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉంది. 20 మంది విద్యార్థులు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు లేక ఏడాది పొడుగునా మూతబడే ఉంది. గత ఏడాది జూన్‌లో ప్రారంభమైన విద్యా సంవత్సరం మరో రెండు రోజుల్లో ముగిసిపోనుండగా, నేటికీ ఆ పాఠశాల అలానే మూతబడి ఉంది. దీంతో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం చెత్తాచెదారంతో నిండి ఉంది. మాస్టారు వస్తారేమో, పాఠశాల తెరుచుకుంటుదేమోనని పిల్లలు అక్కడకు అపుడపుడూ వచ్చి ఆటలాడుకుని వెళ్లిపోతున్నారు. ఇలా ఏడాది గడిచినా ఈ పాఠశాలలో ఉపాధ్యాయుడిని నియామకానికి గానీ, ప్రత్యామ్నాయ ఏర్పాటైనా అధికారులు చేయలేదంటే గిరిజన విద్యపట్ల ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారోస్పష్టమౌతోందని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఏడాది పొడుగునా చదువు దూరమై గాలికి తిరుగుతుండడంతో నేర్చుకున్న కాస్తాకూస్తో అక్షరాలు మరిచిపోగా, క్రమశిక్షణ కూడా గాలిలో కలిసిపోయిందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. తమ పాఠశాలలో మాస్టారిని నియమించి, పిల్లల చదువు గాడిలో పెట్టాలని ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా స్పందించే దిక్కులేదని వాపోతున్నారు. గ్రామంలోని పిల్లలను ఇతర పాఠశాలల్లో చేర్పించాలన్న ధ్యాస కూడా అధికారుల్లో లేకపోవడాన్ని చూసి విస్తుపోక తప్పనిస్థితి. ఒక విద్యా సంవత్సరం ఏలాగూ గాలిలో కలిపేసిన అధికారులు, వచ్చేఏడాదిలోనైనా కర్ణికోట పాఠశాలలో ఉపాధ్యాయుడిని నియమించి, తెరిపించే చర్యలు చేపట్లాని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు పల్లాల చిట్టం రెడ్డి, పల్లాల బాలురెడ్డి సాదల సోమరాజు,వేమ సోమిరెడ్డి, వేమ దేవిరెడ్డి, సాదల దినేష్ రెడ్డి గ్రామస్తులు వేడుకుంటున్నారు.

చెత్తాచెదారం నిండిన పాఠశాల భవనంలో చిన్నారులు

ఉపాధ్యాయుడు లేక మూతపడిన కర్ణికం స్కూల్

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-అరకులోయ:కురిడి గ్రామంలో ఆదివారం జరిగిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది.విశాఖపట్నం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో ఈ ప్రాంతంలోని యువతీ యువ కులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రణతి, రోటరీ బ్లడ్ క్లబ్ ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న విద్యార్థులు

నిర్వాసితుల గుర్తింపులో నిర్లక్ష్యం వద్దు

• సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పులి సంతోష్ కుమార్, మేకల నాగేశ్వరరావు

సమావేశంలో మాట్లాడుతున్న సంతోష్‌కుమార్

ప్రజాశక్తి- విఆర్ పురం: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో సర్వం కోల్పోయి, ప్రస్తుతం ఏటా ప్రాజెక్టు వలన వరద నీళ్లల్లో మునిగి తేలుతున్న పోలవరం నిర్వాసితులను గుర్తించడంలో అధికారుల నిర్లక్ష్య వైఖరి మారడం లేదని, ఇదే కొనసాగితే గ్రామసభల్లో తిరుగుబాటు తప్పదని సిపిఎం జిల్లా కమిటి సభ్యులు పులి సంతోష్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం రేఖపల్లిలోని పార్టీ కార్యాలయంలో పంకు.సత్తిబాబు అధ్యక్షతన జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ వి.ఆర్ పురం మండలం రామవరం గ్రామంలో ఉన్న కుటుంబాలన్నింటినీ పిడిఎఫ్ జాబితాలో చేర్చలేదని, తప్పిపోయిన కుటుంబాలను జాబితాలో కలపాలని ఎన్నోసార్లు అధికారులకు విన్నవించినా, స్వయాన ఐఎఎస్ స్థాయి అధికారి ఆ గ్రామ సందర్శనలో దీనిపై హామీ ఇచ్చినా అమలు చేయకపోడం దారుణమన్నారు. ఐటిడిఎలో గ్రామస్తులందరూ దీక్షలు చేసినపుడు ఐటిడిపి పిఒ ఇచ్చిన హామీ అమలు చేయకపోవడం సరికాదన్నారు. నేటికీ ఆ కుటుంబాలను గుర్తించకుండా అన్యాయం చేయాలని చూస్తున్నారని, మళ్ళీ సగం కుటుంబాలకే స్ట్రక్చర్ వాల్యువేషన్ గురించి గ్రామసభ పెడతామని చెప్పడం ఆ గ్రామ నిర్వాసితులను మోసం చేయడం తప్ప మరొకటి కాదన్నారు. పలు గ్రామాల్లో నిర్వాసితుల భూమి, ఆర్అండ్ఆర్ సమస్యలు నేటికీ పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసారు. నిర్వాసితుల పట్ల అధికారుల నిలక్ష్య వైఖరి ఇలానే కొనసాగితే బాధిత ప్రజలు ఎదురుతిరిగే పరిస్థితిని కొనితెచ్చుకోవద్దని హెచ్చరించారు. సమావేశంలో పార్టి జిల్లా నాయకులు సున్నం.రాజులు, సోయం.చినబాబు, ఎంపిపి కారం లక్ష్మి, మండల నాయకులు కారం.సుందరయ్య, గుండిపూడి లక్ష్మణరావు, వడ్లాది.రమేష్, కదల కొండారెడ్డి, పొడియం శ్రీరామమూర్తి, తోడం రాజు, కమ్మచ్చిచ్చు సత్యనారాయణ, సీరపు.తాతబాబు పాల్గొన్నారు.

భూనిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి

కూనవరం: పోలవరం ప్రాజెక్టులోభూములు కోల్పోతున్న గిరిజనులకు భూమికి భూమి , సాగునీటి సదుపాయం, నిర్వాసితులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. .కూటూరు, రేగులపాడు గ్రామాల్లో సిపిఎం శాఖా సమావేశాల్లో మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్టు రాష్టానికి గుండె కాయ వంటిదనికేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లోని మంత్రులు, నేతలు ఊదరగొట్టేలా మాట్లాడడమే తప్ప, ఈ ప్రాజెక్టుకు త్యాగం చేసే ముంపు ప్రజలను మభ్యపెడుతూ నష్టపుచ్చుతున్నారన్నార. 41.5 కాంటూరులో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, ఇండ్ల ప్యాకేజీ ఇస్తామని ప్రభుత్వం హడావిడి చేస్తుందే తప్ప, ఇవ్వడం లేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం తక్షణమే పోలవరం ప్రాజెక్టు 41.5 కాంటూరు లో మునుగుతున్న భూములకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం లో జిల్లాకార్యదర్శి వర్గ సభ్యులు సున్నం రాజులు,జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు, మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, శాఖ కార్యదర్శి నూప రాజు, సభ్యులు చిచ్చడి రాజయ్య, సోడె శ్రీరాములు, పద్దం రాజు శేఖర్, బొగ్గా సుబ్బయ్య, గుండం బాబురావు, బుచ్చమ్మ, సుబ్బమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నేత నాగేశ్వరరావు

ఘనంగా సిఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు

అరకులోయలో పండ్లు, రొట్టెలు అందజేస్తున్న దొన్ను దొర

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు 75వ జన్మదినం వేడుకలను అరకు ఇన్చార్జి, ఏపీఎస్ ఆర్టీసీ విజయనగరం రీజినల్ బోర్డు చైర్మన్ సియ్యారీ దొన్ను దొర ఆధ్వర్యంలో టీడీపీ ఆదివారం అరకులోయ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం అరకులోయ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 120 రోగులకు రొట్టెలు పాలు పండ్లు పంపిణీ చేశారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.మాదల పంచాయతీ సరుబెడ్డ గ్రామంలో 500 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా దొన్నుదొర మాట్లాడుతూ, చంద్రబాబు మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు శెట్టి బాబురావు, పెదలబుడు సర్పంచ్ పెట్టేలి దాసుబాబు,ఉప సర్పంచ్ నిర్మల, మాజీ ఎంపీటీసీ కుమార్, మాజీ సర్పంచ్ రాము, మాజీ సర్పంచ్ మహదేవ్, మహిళ మాజీ అధ్యక్షురాలు బోరిబోరి లక్ష్మి, వార్డు మెంబర్ గంగా, సీనియర్ నాయకులు పాడి చందు, భీమన్న సుబ్బారావు పాల్గొన్నారు.

పెదబయలు: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుట్టినరోజు సందర్భంగా మండలం కేంద్రం లో "కేక్ " కట్ చేసి శుభాకాంక్షలు తెలిజేశారు. ఈ కార్యక్రమంలో మండలం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, సీతగుంట పంచాయతీ మాజీ సర్పంచ్ త్రినాధ్, మండల ప్రధాన కార్యదర్శి. పాంగి. నాగేశ్వరరావు, తెలుగు రైతు సంఘం అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు కూడ. భూషణరావు, కొర్ర. నాగరాజు, కిముడు. తిరుపతి, విశ్వేశ్వరావు, కొర్రా. మహేష్, కొర్ర రాజారావు పాల్గొన్నారు.

పాడేరు: చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు పాడేరులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ శాసనసభ్యులు గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. గిడ్డి ఈశ్వరి స్వగృహంలో కేకును కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం వెూదకొండమ్మ ఆలయంలో పత్యేక పూజలు నిర్వహించారు. పాడేరు జిల్లా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. తెలుగుదేశం పార్టీ పాడేరు కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 2000 మందికి పైబడి గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

చింతపల్లి: చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు కొమ్మంగి గ్రామంలో కొమ్మంగి పంచాయతీ వార్డు సభ్యుడు చల్లంగి శ్రీను ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో బడుగు బలహీన పేద ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం చంద్రబాబు పనిచేస్తున్నారని కొనియాడారు.

ముంచింగిపుట్టు: మండలంలో టిడిపి నాయకులు రెండు వర్గాలు వీడి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు చేపట్టారు.ఒకే పార్టీలో కొనసాగుతూ రెండు వర్గాలు చీలి జన్మదిన వేడుక చేయటం పట్ల మండల టిడిపి కార్యకర్తలు, సానుభూతిపరులు, అభిమానుల్లో చర్చ నీయాంశంగా మారింది. టిడిపి మండల అధ్యక్షుడు బలరాం ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అలాగే టిడిపి అరకు పార్లమెంటు ఆర్గనైజేషన్ సెక్రటరీ పాంగి శాస్త్రి బాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

01 రంపచోడవరంలో కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే

రంపచోడవరం : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 75వ పుట్టినరోజు సందర్భంగా రంపచోడవరం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి కేక్ కట్ చేసి తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు తినిపించారు. ఎమ్మెల్యే శిరీషాదేవికి మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబూ రమేష్, కేకు ను తినిపించారు. దేవి గుడి, అంబేద్కర్ సెంటర్ వద్ద మజ్జిగ పంపిణీ చేశారు. రంపచోడవరం ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు,పండ్లు, పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి ప్రధాన కార్యదర్శి, పెంటపాటి అనంత మోహన్, మాజీ మండల అధ్యక్షులు అడబాల బాపిరాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సలాది బాపిరాజు, పండా చెల్లన్న దొర, సింహాచలం, ఎస్.కె చోటు, డి జనార్దన్, సిద్ధ వెంకన్న, రమణ, ఎమ్ లోవరాజు, సురేష్, డి వెంకన్న, కుంజం బాపన్న దొర, నాగు, నర్సిరెడ్డి, సత్యవతి, పెంటమ్మ, కొండబాబు, వెంకటలక్ష్మి, టి వర్మ, జోగి రెడ్డి, సింగోజి రామారావు పాల్గొన్నారు.

అడ్డతీగల : స్థానిక మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు జర్త వెంకటరమణారెడ్డి, ఆధ్వర్యంలో కూటమి నాయకుల సమక్షంలో కేక్ కటింగ్ చేసి చంద్రబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నేతలు శ్రీరామ్ స్వప్నకుమారి, తాటికొండ రాజేంద్ర, వంకా సతీష్, ఎడ్ల శ్రీను, అడారి నాగబాబు, వడ్డె రాంబాబు, చదువుల రామకృష్ణ, చెక్క వీరలక్ష్మి, మాజీ ఎంపిటిసి పుడిగా ఆదిలక్ష్మి, జుజ్జవరపు శ్రీనివాస్ చౌదరి, కేసకుర్తి ఆనందరావు, సత్తి సత్తిరెడ్డి, చిట్టోజి బాబనమ్మ, కామన్ కృష్ణమూర్తి, బటాని వరలక్ష్మి, ముర్ల సత్యవతి, బచ్చలా రాధాకష్ణమూర్తి, చదల చితుకుల రెడ్డి, నెరం వెంకటరమణ, అన్నం అబ్బాయి రెడ్డి, బ్రహ్మం అప్పారావు, నిడిగట్టు రమేష్, చలిమర్తి వీరపురెడ్డి, ఎలుబండి మంగరాజు, చింతాజి శ్రీనుబాబు, వేగి నానాజీ, బొగ్గ బాబురావు, వేగి కష్ణ, కింతాడు నాని బాబు, ముగ్రం కాశిబాబు, సారాపు రాజబాబు, బేలం సత్తిబాబు, దొమ్మేటి అప్పారావు, నక్క ప్రేమ్ కుమార్, బిత్తర అనిల్, కొల్లబత్తుల సురేష్ పాల్గొన్నారు

గంగవరం : ముఖ్యమంత్రి చంద్రబాబు 75 వ జన్మదిన వేడుకలు టిడిపి మండల అధ్యక్షులు పాము అర్జున్ ఆధ్వర్యంలో నిర్వహించారు.కార్యక్రమంలో గంగవరం సర్పంచ్ కలుమూల అక్కమ్మ,జనసేన మండల పార్టీ అధ్యక్షులు కుంజం సిద్దు మాజీ ఎంపీపీ తిగల ప్రభ , బీజేపీ జిల్లా నాయకులు కుంజం వెంకటేశ్వర్లు,మాజీ కోఆప్సం సభ్యులు కొమ్మన చిన్నారావు మాజీ ఎంపిటిసి బుల్లియమ్మ సత్యవేణి రాంబాబు వీరబాబు పల్లాల వెంకటరెడ్డి రాంబాబు మాస్టర్ కృష్ణ పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా మండలంలోనిజడ్డంగి మూడురోడ్ల జంక్షన్ వద్ద టిడిపి నాయకులు గణజాల తాతారావ్ ఆధ్వర్యం స్వీట్స్ పంపిణీ చేశారు. పిహెచ్‌సిలో రోగులకు రొట్టెలు,పండ్లు పంపిణీ చేశారు,మార్కెట్ రోడ్‌లో వృద్ధులకు పండ్లు పంచారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు వాసంశెట్టి గంగాధర్, తెలుగుయువత మండల అధ్యక్షుడు బారంగి అనుదీప్,చెక్కా పండుబాబు,గణజాల మల్లిఖార్జున, సింగిరెడ్డి శంకర్,పురంశెట్టి సూర్యనారాయణ మూర్తి,రాటా సోమరాజు,వేమగిరి వెంకటేష్, బారంగి రాజేష్,మొల్లా అభిషేక్, కోమర్తి శ్రీనివాస్,కంఠపురెడ్డి వీరబాబు,పాల్గొన్నారు.

సీలేరు: సీలేరులో దుర్గాదేవి షెడ్ వద్ద టిడిపి సీనియర్ నేత బొర్రా కృష్ణ భవాని శంకర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ముఖ్యమంత్రి చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు కే సన్యాసిరావు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిటికెల రాము నూకరాజు గోవిందు జనసేన నాయకులు బాలు వనముల రాము ముంది తెదేపా అభిమానులు శ్రీధర్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

మారేడుమిల్లి: తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గురుకు శేషు కుమార్ ఆధ్వర్యంలో పార్టీ మండల కార్యాలయంలో చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు మాజీ ఎమ్మెల్యేలు సీతంశెట్టి వెంకటేశ్వరరావు, వంతల రాజేశ్వరి పాల్గొని కేకు కట్ చేశారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ పల్లాల రాజకుమార్ రెడ్డి, దంతులూరి శివాజీ రాజు. దూడ సువర్ణ కర్ణ కుమార్. భీశెట్టి అప్పాజీ, పుచ్చల గురునాథరెడ్డి.కాశ గాని వంశీకృష్ణ, షేక్ ఖాదర్. పెథకంశెట్టి రాము. తుమ్మిడి లక్ష్మీనారాయణ పవన్ ప్రకాష్. ఆటో యూనియన్ అధ్యక్షులు. కోడూరు సత్యనారాయణ పాల్గొన్నారు..

పాడేరులో పండ్లు అందజేస్తున్న గిడ్డి ఈశ్వరి

మాట్లాడుతున్న సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ

విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకం

సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి- అరకులోయ: విద్యార్థుల అభివృద్ధికి గురువులతో పాటు, తల్లిదండ్రులు ప్రధానమైన పాత్ర పోషించడం ద్వారానే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని మాజీ సిబిఐ జాయింట్ డైరెక్టర్ జెడి లక్ష్మీనారాయణ అన్నారు. అరకులోయలోని అల్లూరి సీతారామరాజు పబ్లిక్ స్కూల్లో ఆదివారం సాయంత్రం 40 వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కూడా తల్లితండ్రులు, గురువుల ప్రోత్సాహంతోనే ఉన్నత స్థితికి చేరుకొని అణు శాస్త్రవేత్త కావడమే కాకుండా, భారత దేశానికి రాష్ట్రపతి వంటి అత్యున్నత పదవి అధిరోహించారని ని ఆయన అన్నారు.అల్లూరి సీతారామరాజు కూడా విద్యార్థి దశ నుంచే పోరాట పటిమ అలవర్చుకొని బ్రిటిష్ వారిని తరిమికొట్టి అందరి హృదయాల్లో నేటికీ బతికి ఉన్నారని ఆయన అన్నారు విద్యార్థులకు మహానేతల కథలు చెప్పడంతో వారిలో దేశభక్తి అలవడుతుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలతో సమయం గడపాలని ఆయన సూచించారు. ముందుగా విద్యార్థులకు జేడీ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహారాజా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అల్లూరి సీతారామరాజు సీబీఎస్ఈ పబ్లిక్ స్కూల్ అరకులోయ అధ్యక్షులు అల్లూరి సత్యనారాయణ రాజు, అనెస్తేసియా అకాడమిక్ డైరెక్టర్ మిమ్స్ డాక్టర్ టి.వేణుగోపాలరావు, ఆంధ్ర విశ్వవిద్యాలయం సేనెట్ అధ్యక్షులు, గీతం విశ్వవిద్యాలయం సభ్యులు బి.ఎస్.ఎస్.ఎన్. రాజు, కార్యదర్శి బి.రామకృష్ణ, కోశాధికారి రాజు, అల్లూరి సీతారామరాజు పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ జి. నర్సయ్య వైస్ ప్రిన్సిపాల్ ఎన్.శ్రీనివాసరాజు, పి. ఆర్.ఓ.వర్మ పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

- జిల్లా ఎస్పి అమిత్ బర్గర్

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని ఏ.అన్నవరం పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ అమిత్ బర్గర్ చింతపల్లి ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ స్టేషన్ భవనాలను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతంలో ఈ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా ఉండడంతో గంజాయి రవాణా అవకాశం ఉందని, దీని నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు.యువత ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడకుండా చర్యలు చేపట్టాలన్నారు ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి అవకాశాలను గిరిజన రైతులు, యువత సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ వినోద్ బాబు, ఎస్ఐ వీరబాబు పాల్గొన్నారు.

భవనాన్ని పరిశీలిస్తున్న ఎస్పి అమిత్ బర్గర్

డ్రాయింగ్ పోటీలు

ప్రజాశక్తి -మాధవధార : ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యాన డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నగరంలోని లిటిల్ ఏంజెల్స్, ప్రెసిడెన్షియల్ స్కూల్, కేంద్రీయ విద్యాలయం, శివశివాని, శ్రీశిష్ట స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ ముకుందరావు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి కాలుష్యాన్ని నియంత్రించాలని కోరారు. కాలుష్య నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కోసం ఈ డ్రాయింగ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. చిన్ననాటి నుండే కాలుష్యంపై విద్యార్థులకు అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 22వ తేదీన బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

శాస్త్రీయ పద్ధతులు అలవాటు చేసుకోవాలి

ప్రజాశక్తి -గాజువాక : పిల్లలు శాస్త్రీయ పద్ధతులను అలవాటు చేసుకోవాలని డాక్టర్ ఎం.రమేష్‌కుమార్ సూచించారు. గాజువాకలో విసిసి సమ్మర్ క్యాంప్ నిర్వహణకు సంబంధించి ఆయన నివాసంలో ఆదివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విసిసి చేపడుతున్న వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కన్వీనర్ కె.సుశీల మాట్లాడుతూ, వినోదంతో పాటు విజ్ఞానం కూడా అందించాలని ఉద్దేశంతో వేసవిలో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్యాంపుల ద్వారా నివాస ప్రాంతాల్లో పిల్లల మధ్య స్నేహం పెరిగి, మొబైల్‌కు దూరంగా ఉంటారని పేర్కొన్నారు. తెనాలికి చెందిన జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ నాయకులు రాయపాటి శివ నాగేశ్వరరావు పాల్గొని రోజూ ఉపయోగించే వస్తువులు, మన చుట్టూ ఉన్న వాటితో సైన్స్ ప్రయోగాలు చేసి చూపించి నేర్పించారు. దీని కోసం కిట్ తయారు చేశారు. అందరికీ చేసి చూపించి పిల్లల చేత చేయించారు. ఈ వర్క్ షాప్‌లో ఓరిగామి, టీం గేమ్స్, మెమరీ గేమ్స్, ఓల్డ్ గేమ్స్, కమ్యూనికేషన్స్ గేమ్స్, పాటలు కూడా నేర్పించారు. ఈ కార్యక్రమంలో జోన్ కన్వీనర్ అప్పారావు, ఆర్గనైజర్లు స్వర్ణలత, సంతోషం, వర్షిణి, కృష్ణవేణి, బాల, ధనుష్, థాన్ ఫౌండేషన్ సభ్యులు సరోజిని, యమున పాల్గొన్నారు.

కొనుగోలుదారుల కోసం ఎదురుచూస్తున్న చిరు వ్యాపారులు

వెలవెలబోయిన వారపు సంత

ప్రజాశక్తి -సీలేరు: మన్యంలోని గిరిజనులు ప్రస్తుతం ఇటుకల పండగలో పూర్తిగా నిమగ్నమయ్యారు. ఊరూరా పండుగ సందడే తప్ప మరోకటి లేదు. దీంతో సీలేరులో నిర్వహించే ఆదివారం వారపుసంతకు కూడా వారు రాని పరిస్థితి ఉంది. దీంతో సంత బోసిపోయింది. ప్రతి ఆదివారం ఆంధ్రాఒడిశా సరిహద్దు సీలేరు, దుప్పిలివాడ పంచాయతీ పరిధి పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో గిరిజనులు సీలేరు సంతకు తరలి వచ్చేవారు. గిరిజన పండగ చివరి దశకు చేరుకోవడంతో గిరిజనులు వారపు సంతకు రాకపోవడంతో వారపు సంత వెలవెల పోయింది. మారుమూల గిరిజన గ్రామాల నుంచి కూరగాయలు సైతం ఆశించిన స్థాయిలో రాలేదు. దుప్పిలివాడ గ్రామానికి చెందిన మాలీలు చెందిన వివిధ రకాలు కూరగాయలు తెచ్చినప్పటికీ జనాలు రాకపోవడంతో అమ్మకాలు లేక నిరాశకు గురయ్యారు. మరోపక్క రెండు రోజుల కంటే ఆదివారం ఉష్ణోగ్రత మరింత అధికమైంది. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు గుంటవాడలో 38 డిగ్రీలు. దుప్పిలివాడ పంచాయతీ రుషికొండలో 37 డిగ్రీలు సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదు కావడంతో ఎండలను తట్టుకోలేక కొందరు సంతకు రాలేదు. మొత్తానికి సీలేరు వారపుసంత వ్యాపారులు, కొనేవాళ్లు రాక వెలవెలబోయింది.

స్కేటింగ్‌లో సత్తా చాటిన డివి.ప్రీస్టిక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పంజాబ్ రాష్ట్రంలోని మొహాలీలో జరిగిన రెండో జాతీయ స్థాయి ఓపెన్ ఛాంపియన్‌షిప్ స్కేటింగ్ పోటీల్లో నగరానికి చెందిన ప్రీస్టిక సత్తా చాటింది. ఐదో తరగతి చదువుతున్న ఆమె 10-12 ఏళ్ల బాలికల విభాగం స్పీడ్ స్లాలమ్‌లో రజతం, క్లాస్ స్లాలమ్‌లో రజతం కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా ప్రీస్టికను ఇండియన్ అమెచ్యూర్ రోలర్ స్కేటింగ్ అకాడమీ కార్యదర్శి ఎస్.లక్ష్మణ్, కోచ్‌లు సింహాద్రి, మనోహర్, ఇతర స్కేటర్లు అభినందించారు. ఆమె ఇండియన్ అమెచ్యూర్ రోలర్ స్పోర్ట్స్ అకాడమీలో సింహాద్రి, మనోహర్ మార్గదర్శకత్వంలో 2022 మేలో ఇన్లైన్ ఫ్రీస్టైల్ స్కేటింగ్‌లో తన ప్రయాణాన్ని ప్రారంభించింది. పలు రాష్ట్ర, జాతీయ పోటీల్లో పాల్గొని 9 స్వర్ణాలు, 4 రజతాలతో సహా మొత్తం 15 పతకాలు సాధించింది.

ఐకానిక్ సిటీ ఆఫ్ గోల్డ్‌లో అధునాతన సౌకర్యాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రుషికొండ ఐటి హిల్ నెంబర్ 3 సమీపంలో 97 ఎకరాల్లో ఐకానిక్ సిటీ ఆఫ్ గోల్డ్ పేరిట టౌన్ షిప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్టు ప్రమోటర్స్ కె.మురళీకృష్ణ, కె.సంతోష్ తెలిపారు. ఆదివారం హోటల్ డాల్ఫిన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 24న త్రిదండి చిన జీయరు స్వామి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నట్టు వెల్లడించారు. మొదటి దశలో 4,500 నుంచి 10 వేల చదరపు అడుగుల విస్తీర్ణంగల 180 విల్లాలు నిర్మిస్తామని చెప్పారు. కమర్షియల్ కాంప్లెక్స్‌లు, కన్వెన్షన్ సెంటర్, ఫైవ్ స్టార్ హోటల్, ఐటి టవర్స్, ప్రీమియం అపార్ట్మెంట్స్ వంటి నిర్మాణాలు దశల వారీగా వస్తాయన్నారు. 45 వేల చదరపు అడుగుల్లో విశాలమైన క్లబ్ హౌస్ నిర్మిస్తున్నామని తెలిపారు. విశాఖ, తిరుపతిలలో ఫైవ్ స్టార్ హోటల్స్ అందుబాటులోకి తెస్తామన్నారు. తన సొంత రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో భారీగా పెట్టుబడులు పెట్టాలనే ఉద్దేశంతో విశాఖలో శ్రీ రామ్ ప్రాపర్టీస్ దగ్గర విల్లాల నిర్మాణం చేపట్టామని, ఎన్‌సిసికి చెందిన భూమిలో ఐకానిక్ సిటీ ఆఫ్ గోల్డ్ టౌన్ షిప్‌ను తీసుకువస్తున్నామని వివరించారు. రియల్ ఎస్టేట్ రంగంలో తమకు 25 ఏళ్ల సుదీర్ఘ అనుభవముందని, బెంగళూరులో గార్డెన్ సిటీ రియల్టర్స్ పేరుతోనూ, హైదరాబాద్‌లో సైబర్ సిటీ పేరుతోనూ వేలాది అపార్ట్మెంట్‌లు, విల్లాలు విక్రయించామని చెప్పారు. నిర్మాణ రంగంలో ప్రప్రథమంగా గ్రీన్ బిల్డింగ్ కాన్సెప్ట్ ప్రవేశపెట్టామన్నారు. ఈ సందర్భంగా ఐకానిక్ సిటీ ఆఫ్ గోల్డ్ బ్రోచర్‌ను ప్రదర్శించారు.

పాలగెడ్డ రహదారి నిర్మించండి

సాధన కమిటీ ఆధ్వర్యాన ధారకొండ వరకు భారీ ర్యాలీ

ప్రజాశక్తి - సీలేరు: జీకే వీధి మండలం ఆర్‌వి నగర్ నుంచి పాలగెడ్డ వరకు అంతరరాష్ట్ర రహదారి నిర్మాణ పనులు తక్షణమే ప్రారంభించాలని వివిధ రాజకీయ పార్టీ నాయకులు సాధన కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ జంక్షన్ నుంచి ధారకొండ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా సిపిఎం గాలికొండ ఎంపిటిసి బుజ్జిబాబు, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కారే శ్రీనివాస్ జనసేన మండల ఉపాధ్యక్షులు సిద్ధార్థ మార్కు రాజు మాట్లాడుతూ రహదారి పనులు తక్షణమే ప్రారంభించకపోతే అధికారుల నుంచి అనుమతులు పొంది మండల బంద్ చేపడతాని హెచ్చరించారు. మండలంలోని మారుమూల గ్రామాలు గంగవరం అగ్రహారం చోడురాయి రహదారులు వంతెనలు నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. గతేడాది సెప్టెంబన్ 8న ముంపునకు గురై భూములు కోల్పోయిన రైతులకు ఇల్లు కోల్పోయిన ప్రజలకు పూర్తిస్థాయి నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఐటిడిఎ పిఒ,ఆర్ అండ్ బి అధికారులు రహదారి నిర్మాణానికి సత్వర చర్యలు చేపట్టి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటివరకు శాంతియుత నిరసన ర్యాలీలు చేపట్టి సమస్యను ప్రభుత్వం దృష్టికి వెళ్లేలా వ్యవహరించామని, ఇకపైనఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రహదారి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు, నేతలు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. తక్షణమే పనులు చేపట్టి, ఏప్రిల్ మే నెలల్లో పూర్తిచేయకుంటే, జూన్ నుంచి వర్షాలు మొదలై అపుడు పనులు ప్రారంభించినా ముందుకు సాగని స్థితి ఉంటుందని అంటున్నారు. ఇప్పటికైనా స్పందించాలని వేడుకుంటున్నారు. కార్యక్రమంలో గుమ్మిరేవుల, దుప్పడివాడ పంచాయతీ మాజీ సర్పంచ్లు పూజారి బాబురావు, అల్లంగి రాజు, కాంగ్రెస్ నాయకులు మల్లు దొర , సిపిఎం నాయకులు బాకూరి కోటేశ్వరరావు, ఆదివాసీ గిరిజన సంఘ నాయకులు, ఆదివాసి ట్రస్ట్ సభ్యులు ప్రజా సంఘాలు నేతలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

అక్రమంగా తరలుతున్న

హాస్టల్ బియ్యం పట్టివేత

ఆటోలో అక్రమంగా తరలుతున్న బియ్యం

ప్రజాశక్తి - రంపచోడవరం : గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల వసతి గృహం నుంచి అక్రమంగా తరలిస్తున్న బియ్యం బస్తాలతో పాటు కందిపప్పు, గోధుమపిండి బస్తాలను శనివారం అర్ధరాత్రి స్థానికుల సమాచారంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆటోలో బియ్యం బస్తాలను తరలిస్తున్నారనిటిఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి దూడ ప్రణీత్‌కు సమాచారం రావడంతో పోలీసులకు విషయం తెలియజేశాడు. దీంతో ఆశ్రమ పాఠశాల వద్ద తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఆటోను సీజ్ చేశారు. ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సింహాచలం ఆదేశాల మేరకు దర్యాప్తు ప్రారంభించారు.

వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి : సిపిఎం నేత వాణిశ్రీ

రంపచోడవరం ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు పెట్టాల్సిన నిత్యవసర సరుకులు పక్కదారి పట్టిస్తున్న వార్డెన్‌ను సస్పెండ్ చేసి, బాధ్యులపై చర్యలు చేపట్టాలని సిపిఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ మట్ల. వాణిశ్రీ డిమాండ్ చేశారు. విద్యార్థులకు పెట్టాల్సిన నిత్యవసర సరుకులను అమ్ముతూ పట్టుబడిన వారిని, కొనుగోలు చేసిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరారు. ఉన్నతాధికారుల ప్రమేయంతోనే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని ఆరోపణలున్న నేపథ్యంలో దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని కోరారు. ఆశ్రమ పాఠశాలల్లోని బియ్యం, కందిపప్పు, గోధుమపిండి ఇతర వస్తువులు రాత్రివేళల్లో గుట్టుగా తరలించి అమ్ముకుంటున్నారని, సంబంధిత అధికారుల పర్యవేక్షణాలోపం దీనికి కారణమని ఆరోపించారు. విద్యాసంవత్సరం ముగింపునకు వస్తుండడంతో పలు ఆశ్రమపాఠశాలలు, హాస్టళ్లలో రెండురోజులుగా ఇదే తంతు కొనసాగుతోందని, దీనిపై నిఘా పెట్టాలని వాణిశ్రీ కోరారు.

కాయలతో చూపరులను ఆకట్టుకుంటున్న మామిడి చెట్టు

విరగ్గాసిన మామిడి చెట్టు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: వైరామవరం మండలంలోని గుమ్మరిపాలెం సమీప అటవీ ప్రాంతం దగ్గరలో ఒక మామిడి చెట్టు చూపురులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఈ చెట్టుకు ఆకులు కంటే మామిడికాయలే ఎక్కువగా ఉన్నాయా అన్నంతగా విరగ్గాయడంతో అటుగా వెళ్లేవారెవరైనా ఒక్కసారైనా దాని వైపు చూసి వెళ్లే పరిస్థితి ఉంది. ఇప్పటివరకు వాతావరణం, ఇతర పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో ఆ మామిడి చెట్టుకు కాయలు అలాగే పెద్దవయ్యాయి. ప్రస్తుతం ఆకులు కంటే కాయలే ఎక్కువగా ఉన్నాయా అన్నట్లు కనిపిస్తున్న ఆ మామిడి చెట్టు ఫొటోను సెల్‌ఫోన్‌లో బంధిస్తున్నారు. కొందరైతే సెల్ఫీలు తీసుకుని సందడి చేసే పరిస్థితి ఉంది. ఈ చెట్టు కాయలు చూడ్డానికి చిన్నవిగా ఉన్నా, ఆ చెట్టు మామిడి పండ్లు ఎంతో తియ్యగా,మధురంగా ఉంటాయని ఆ ప్రాంత గిరిజనులు చెబుతున్నారు.


రాజవొమ్మంగిలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - రంపచోడవరం : గురుకులాల్లో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఆరో తరగతితో ప్రవేశంతోపాటు మిగిలిన తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి మండలంలో ఆరు సెంటర్లలో ప్రవేశపరీక్ష నిర్వహించగా, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న 1500 విద్యార్థులలో 1193 మంది పరీక్షకు హాజరు కాగా 307 మంది గైర్హాజరయ్యారని అధికారులు వెల్లడిచారు రంపచోడవరంలోనిగురుకుల ప్రవేశ పరీక్ష కేంద్రాలను గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం. రుక్మాంగాధయ్య పర్యవేక్షించారు. ీక్ష అనంతరం విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

రాజవొమ్మంగి: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశ పరీక్షకు ఆదివారం నిర్వహించిన ప్రవేశపరీక్షకు 237 మంది విద్యార్థులు హాజరైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిపారు.స్థానిక గురుకుల పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశానికి ఇటీవల ఆన్‌లైన్‌లో 309 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, ప్రవేశ పరీక్షకు 72 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యంతెలిపారు. ఆదివారం పరీక్ష ప్రశాంతంగా జరిగిందన్నారు.

రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : చక్రదరపూర్ డివిజన్‌లో ప్రీ నాన్-ఇంటర్‌లాక్, నాన్-ఇంటర్‌లాక్ పనుల కారణంగా రైలు నెంబర్ 18118 గుణుపూర్ - రూర్కెలా రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్‌ను ఏప్రిల్ 24న, రైలు నెంబర్ 18117 రూర్కెలా- గుణుపూర్ రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్‌ను ఏప్రిల్ 25న రైల్వే అధికారులు రద్దు చేశారు. ప్రజలు పై మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, కె.సందీప్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.